## ఆలయ కేసులో అన్ని కోణాల్లో విచారణ

- డీసీపీ సాధన రష్మీ పెరుమాల్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 19: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి కేసులో అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతుందని ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాల్ తెలిపారు. శనివారం ఆలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ.. ఆలయంలోని విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, కోలుకున్న వెంటనే రిమాండ్‌కు తరలిస్తామని వెల్లడించారు.అదేవిధంగా నిందితుడు బస చేసిన మెట్రోపాలిస్ హోటల్‌ను సీజ్ చేశామన్నారు. సికింద్రాబాద్ బంద్ శాంతియుతంగా జరిగిందన్నారు. ఆలయం వద్ద నిరసనకారులు-పోలీసుల మధ్య కాసేపు ఘర్షణ వాతావరణం నెలకొందని, వెంటనే పరిస్థితిని అదుపులోకి తెచ్చామని పేర్కొన్నారు.

## 'ర్యాలీకి అనుమతి లేదు'

కంటోన్మెంట్ : ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన ఘటనపై శాంతియుతంగా హిందూ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చారని ఉత్తర మండల డీసీపీ సాధన రష్మిక పెరుమాళ్ వెల్లడించారు. శాంతియుతమైన ర్యాలీ చేసే క్రమంలో 3000 మంది హాజరయ్యారని, శనివారం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ర్యాలీకి అనుమతి తీసుకోలేదని స్పష్టం చేశారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ రెండు భాగాలుగా విడిపోయి ఒకరు మెట్రో పోలీస్, మరొకరు ముత్యాలమ్మ ఆలయం వైపుకి దూసుకొచ్చారని చెప్పారు. ముత్యాలమ్మ ఆలయం వైపు ఉన్న మసీదు వైపు వెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారని, పోలీసులుగా తాము, కుమ్మరిగూడ బస్తీవాసులు ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నం చేశామని తెలిపారు. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు, చెప్పులు విసిరారని, ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయని, పరిస్థితి చక్కదిద్దేందుకు లాఠీచార్జి చేయాల్సి వచ్చిందన్నారు. ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేసిన ఆందోళనకారులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. బయట నుంచి వచ్చిన ఆందోళనకారులు ఉద్రిక్త వాతావరణం సృష్టించారని డీసీపీ స్పష్టం చేశారు.

# లష్కర్‌లో స్వచ్ఛందంగా బంద్

- హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీలు
- విజయవంతం చేసిన వ్యాపారులు

బేగంపేట్, అక్టోబర్ 19: హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సికింద్రాబాద్‌లో శనివారం అన్ని వ్యాపార, వాణిజ్య కేంద్రాలు బంద్ పాటించాయి. హిందూ సంఘాల పిలుపు మేరకు అన్నివర్గాల వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో లష్కర్‌లో బంద్ విజయవంతమైంది. సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి రోడ్డు, మహాత్మా గాంధీ రోడ్డు, రాణిగంజ్, జనరల్ బజార్, సుభాష్‌రోడ్డు, టుబాకో బజార్, మోండామార్కెట్, పాలికబజార్, స్టేషన్‌రోడ్డు, బాటా చౌరస్తా, మహంకాళి వీధి ప్రాంతాల్లోని వాణిజ్య కేంద్రాలను మూసివేశారు. ఈ క్రమంలో పలు హిందూ సంఘాల ప్రతినిధులు, భజరంగ్‌దళ్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఏబీవీపీ సంఘాల ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు లష్కర్ ప్రధాన రోడ్లపై భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఉత్తర మండలం పోలీసులు ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంత మంది అక్కడక్కడ అల్లర్లకు పాల్పడటంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి నగరంలోని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

లష్కర్‌లో మూసివేసిన వ్యాపార కేంద్రాలు

### సికింద్రాబాద్ బంద్ విజయవంతం

మారేడ్‌పల్లి : సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ హిందూ ధార్మిక సంఘాలు ఇచ్చిన సికింద్రాబాద్ బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మోండా మార్కెట్, రాంగోపాల్‌పేట్, రెజిమెంటల్‌బజార్, శివాజీనగర్,కుమ్మరిగూడ, నాలా బజార్, చీపురుబస్తీ ప్రాంతాల్లో హోటల్స్, సినిమా థియేటర్స్, విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌ను జయప్రదం చేశారు. సికింద్రాబాద్ మహంకాళి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బాటా రోడ్డు, మోండా మార్కెట్, అల్పా హోటల్, రైల్వే స్టేషన్ ప్రధాన రహదారి మీదుగా కుమ్మరిగూడలోని అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ర్యాలీలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. జై శ్రీరాం, జైజై శ్రీరాం, జై ముత్యాలమ్మ నినాదాలతో లష్కర్ వీధులన్నీ మార్మోగాయి. కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందువులపై పోలీసులు చేసిన లాఠీచార్జిని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు.

సికింద్రాబాద్‌లో జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ హేమ

### నిరసన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ హేమ

ఆలయంలో జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం జరిగిన నిరసన ర్యాలీలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు దోషులను శిక్షించకపోవడం దారుణమని అన్నారు. నిరసనలో పాల్గొన్న వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా దుర్మార్గంగా పోలీసులు ప్రవర్తించడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని ఆమె విమర్శించారు. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, చివరికి దేవుడికి కూడా రక్షణ కరువైందని ప్రభుత్వంపై మండిపడ్డారు.

## బీఆర్ఎస్ నేతలపై బీజేపీ దాడి సరికాదు..

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, అక్టోబర్ 19: గ్రూప్-1 అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీకి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ కార్యకర్తలపై బీజేపీ నాయకులు దాడి చేయడం సరికాదని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నారు. బీజేపీ దాడిలో గాయపడి బీఆర్ఎస్ నాయకుడిని దోమలగూడ పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న గోపాల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకుని దాడి చేయడం మంచిది కాదని అన్నారు. మద్దతు తెలిపే హక్కు అన్ని పార్టీల వారికి ఉంటుందన్నారు.

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

### వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రవి హీలియస్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని పంచముఖి ఆంజనేయ ఆలయంలో ఉచిత బీఎండీ పరీక్షలు నిర్వహించారు.ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ఎము కల పటుత్వం కోసం పోషకాహారం తీసుకోవాలన్నారు. సీనియర్ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ శ్రీదేవీ, డాక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను 12 మంది లబ్ధిదారులకు మూడు లక్షల యాభై ఐదు వేలను అందజేశారు. కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్,కొండపల్లి మాధవ్, పాశం రవి, అస్లాం, శ్యాంసుందర్, శ్రీధర్‌చారి, శివయాదవ్, శ్రీధర్‌రెడ్డి, శివాముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను కఠినంగా శిక్షిస్తాం..

కంటోన్మెంట్, అక్టోబర్ 19: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయ ధ్వంసానికి పాల్పడిన దుండగులకు కఠినమైన శిక్ష పడేలా చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని కలిసి జరిగిన ఘటన గురించి వివరించారు. మంత్రి, ఎమ్మెల్యే జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంఘటనను రాజకీయం చేయకుండా అందరూ సహకరించాలన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ తన సొంత నిధులు రూ. 10 లక్షలు, మంత్రి పొన్నం రూ. 10 లక్షలు ఆలయ పునర్నిర్మాణానికి అందజేస్తామని ఆయన తెలిపారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కిరణ్, వంశీ, రంజిత, ముప్పిడి మధుకర్, శేఖర్‌ముదిరాజ్, బలవంత్‌రెడ్డి, సదానంద, మారుతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేశ్, ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు

## వృత్తివిద్యా కోర్సులతో విస్తృత ఉపాధి

చెఫ్ డేలో చిన్నారులతో చెఫ్‌లు

అమీర్‌పేట్, అక్టోబర్ 19: వృత్తి విద్యా కోర్సులతో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణ బోర్డు కార్యదర్శి పుల్లయ్య అన్నారు. విద్యార్థులకు చిన్న నాటి నుంచే తమ రెగ్యులర్ చదువులతో పాటు వృత్తి విద్యా కోర్సుల పట్ల అవగాహన కల్పించడం ద్వారా వారు తమ భవిష్యత్తును ఆయా పరిస్థితులకు అనుగుణంగా మలుచుకోగలరని అన్నారు. ఉద్యోగాలు లేదా స్వయం ఉపాధి ద్వారా అంచెలంచలుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతర్జాతీయ చెఫ్ డేను పురస్కరించుకొని శనివారం బేగంపేట్‌లోని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఏఐ చీఫ్ చెఫ్ అక్షయ్ కులకర్ణితో పాటు సీఏఐ విద్యార్థులు రుచులను వండి వడ్డించారు. అంతర్జాతీయ చెఫ్ డేను పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో సీఏఐ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారులకు ప్రమోషన్లు కల్పించాలి

చిక్కడపల్లి, అక్టోబర్ 19: రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులకు సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ అధికారుల సంఘం ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ వైద్యనాథ్ మట్లాడుతూ.. అన్ని కేడర్స్‌లో సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేయాలని ఆయన కోరారు. ప్రతి వ్యవసాయ అధికారికి వాహనంతోపాటు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని, వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శవిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అనూరాధ, కోశాధికారి రవీందర్, వీణారెడ్డి, మానస పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వైద్యనాథ్

## తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 19: భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు జి.స్వరూప మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధతో బోధన అందిస్తున్నామని, తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలను ప్రతిరోజు స్కూల్‌కు పంపాలని, ఇంటికి రాగానే హోంవర్క్ చేయించాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికమిటీ అధ్యక్షుడు ఈ. చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నట్టు తెలిపారు. దాతల సహకారంతో వసతులు సమకూరుస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా 2024 డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఎంపికై పాఠశాలలో చేరిన 10 మంది నూతన ఉపాధ్యాయులను సన్మానించి అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయుడు కె.మల్లికార్జున్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు ఆర్.రాజు, కోశాధికారి వీజే శేషగిరిరావు, కార్యదర్శి గోపికృష్ణ, భరత్‌భూషణ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు స్వాగతం పలికిన హెచ్ఎం స్వరూప, మల్లికార్జున్‌రెడ్డి

## పుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు

ముషీరాబాద్, అక్టోబర్ 19: ముషీరాబాద్ డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో పుట్‌పాత్ ఆక్రమణలు జీహెచ్ఎంసీ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. ముషీరాబాద్-పద్మారావునగర్, ముషీరాబాద్-బాపూజీనగర్ మార్గంలో పుట్‌పాత్‌ను ఆక్రమించి షాపులు, షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ సిబ్బందితో కలిసి కూల్చివేతలు చేపట్టారు. ఇకపై పుట్‌పాట్‌లను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శ్రీధర్, అనిల్, రాజయ్య పాల్గొన్నారు.

పుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ అధికారులు

## ఓయూ వీసీకి శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎం. కుమార్‌ను ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు సోమశేఖర్, డాక్టర్ పల్లెర్ల సుధాకర్, డాక్టర్ ఎర్రం నాగేంద్రం, రఘువరన్, వంగాల వెంకటేశ్, ఈదుల రాజీవ్‌ప్రదీప్, ప్రశాంత్, మహేందర్, విజయ్, అంజి, రవి, లింగం తదితరులు పాల్గొన్నారు.



వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థి నాయకులు

## వీసీ నియామకాల్లో గిరిజనులకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 19: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల వీసీల నియామకాల్లో గిరిజన ప్రొఫెసర్లకు తీవ్ర అన్యాయానికి గురిచేసి అవమానించారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కరాటే రాజునాయక్ మండిపడ్డారు. ఎటువంటి అనుబంధ కళాశాలలు, ప్రభుత్వ గుర్తింపు కూడా సరిగా లేని మహిళా యూనివర్సిటీకి గొప్ప ప్రతిభ ఉన్న గిరిజన మహిళా ప్రొఫెసర్ సూర్యాధనుంజయకు ఇన్‌చార్జి వీసీగా నియమించి అవమానించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో తొమ్మిది వర్సిటీలకు వీసీలను నియమించినప్పటికీ, అందులో ఒకరు కూడా గిరిజన ప్రొఫెసర్ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా కమిషన్, ఎడ్యుకేషన్ అడ్వైజరీ కమిటీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలిల్లో కూడా గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించలేదని వాపోయారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖకు కనీసం మంత్రి కూడా లేరని గుర్తు చేశారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖకు బంజారా వ్యక్తిని మంత్రిగా నియమించాలని డిమాండ్ చేశారు.

## లైన్‌మెన్‌పై లైన్ ఇన్‌స్పెక్టర్ దాడి

బొల్లారం, అక్టోబర్ 19: ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల మధ్య ఘర్షణ తలెత్తడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన శనివారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌బజార్‌లోని విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ బూర్గు ప్రసాద్, లైన్‌మైన్ రాముకు మధ్య ఘర్షణ తలెత్తింది. కోపోద్రిక్తుడైన లైన్‌ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రాముపై తీవ్రంగా గాయపరిచాడు. కాగా లైన్‌మెన్ కాగితాల రాము తలకు తీవ్రగాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. రాము ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ,అక్టోబర్ 19 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీకామ్ ఆనర్స్,బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ అన్ని కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ. 500 అపరాధ రుసుముతో 28వ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

## హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, అక్టోబర్ 19: దోమలగూడలోని శ్రీహనుమాన్ ఆలయంలో శనివారం హుండీ లెక్కించారు. ఈఓ దేవానథం, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. దేవనాథం మాట్లాడుతూ మొత్తం రూ.1,95,750 వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు ఎంఆర్‌కే ప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ సలంద్రి,మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం..

మల్కాజిగిరి, అక్టోబర్ 19: డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ నగర్‌లో రూ.46లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేసి మాట్లాడారు.

# నిరుద్యోగులకు మద్దతుగా బీఆర్ఎస్

ముషీరాబాద్, అక్టోబర్ 19: నిరుద్యోగులకు మద్దతుగా ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ తరలించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు మద్దతుగా 29 జీవో రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రావణ్‌కుమార్, గజ్జెల నాగేశ్, ముఠా జయసింహ, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, రాకేశ్, వి.శ్రీనివాస్‌యాదవ్, దీన్‌దయాల్‌రెడ్డి, సయ్యద్ అస్లాం, సర్వర్, సాయి తదితరులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 29 జీవో తీసుకువచ్చి నిరుద్యోగులను అయోమయానికి గురిచేస్తుందన్నారు. ఇప్పటికే నాలుగుదై సార్లు పరీక్ష వాయిదా వేసిందని ఆరోపించారు. గ్రూప్-1 నోటిఫికేషన్ ఇంకా ముందుకు కదలడం లేదని, దీంతో చాలామంది అభ్యర్థుల్లో అయోమయం నెలకొందన్నారు. ప్రభుత్వం తీసువచ్చిన 29 జీవోతో రిజర్వుడ్ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.



పోలీసుస్టేషన్‌లో దాసోజు శ్రావణ్‌కుమార్, గజ్జెల నాగేశ్, ముఠా జయసింహ

## డిప్యూటీ మేయర్‌ను కలిసిన సర్కిల్ ఈఈ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 19: నూతనంగా సికింద్రాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌సాయి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి వచ్చి డిప్యూటీ మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ సర్కిల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సర్కిల్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సువర్ణ, ఏఈ వేణు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైకాలజిస్ట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట్, అక్టోబర్ 19: సైకాలజిస్ట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్వీకార్ ఫౌండేషన్ చైర్మన్ హనుమంతరావు అన్నారు. శనివారం సికింద్రాబాద్ ప్యారడైజ్‌లోని కార్యాలయంలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిన ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ప్రధానం అన్నారు. నేటి యువత మానసిక ఆరోగ్యం దేశానికి ఎంతో ముఖ్యమని, అందుకు జీవన విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డాక్టర్ ప్రీతి స్వరూప్ పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యం, అలాగే డాక్టర్ అర్చన మైండ్‌ఫుల్‌నెస్ ద్వారా మానసిక ఆరోగ్యం అనే అంశాలపై అవగాహన కల్పించారు. పలువురు సైకాలజిస్ట్‌లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 19 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 21 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ఎంబీఏ(టీఎం-ఈవినింగ్,ఈవినింగ్) ప్రవేశాల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 19: ఓయూ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ -ఈవినింగ్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు గడువును పొడగించినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ పి.జలపతి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని, ఈ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్